
# మూగ సూర్యం

వింధ్యవాసిని

పన్నెండేళ్ళ ఆ మూగ కుర్రాడు నా మనసు నింతగా కదిలించగలడని



నే నెప్పుడూ అనుకోలేదు. మొదటగా వాణ్ణి నే చూడటం చాలా చిత్రంగా జరిగింది.

ఆ వేళ సాయంత్రం ఏమీ తోచక పాపని చంకనేసుకుని, అయిదేళ్ళ బాబుని చేత్తోపట్టి, పార్క్ వయిపుకు దారి తీసాను.

పార్క్‌లో మామూలుకంటే ఎక్కువమంది పిల్లలు కన్పించారు. "ఏమిటా విశేషం?" అనుకున్నాను. ఇంతలో నా దృష్టి పిల్లలకి దగ్గరగావున్న బెంచీమీద కూచునివున్న ఒక ముసలావిడ మీదపడింది. కారణం అర్థమయింది. ఎవరో చెప్పగా విన్నాను—ఆవిడ శ్రీమహాలక్ష్మి అనాధ శరణాలయం మేట్రన్ అని.

ఆవిడకి యాభై ఏళ్ళకి పైనేవుంటాయి. మల్లెపూవులాంటి తెల్లటి చీరా, చిన్నముడీ స్వచ్ఛమయిన ఆ చిరునవ్వూ—నన్నెంతో ఆకర్షించాయి.

నాకు తెలీకుండానే, నా కాళ్ళు ఆమె వయిపుకి లాగేయి. బాబు చెయ్యి వదిలేసాను. పిట్టలా ఎగిరిపోయి పిల్లల్లో దూరాడు వాడు.

మెల్లిగా ఆవిడ పక్కనే కూచుని పాపని వళ్ళో కూచోబెట్టుకున్నాను. ఆవిడ

చిరునవ్వుతో నా వయిపు చూపింది. మెల్లిగా మాటలు కలిపాను.

"ఈవాళ పిల్లలతో పార్క్ భలే నిండుగా వుందండి" అన్నాను నవ్వుతూ.

"అవునమ్మా...సూర్యకాంతి పువ్వుల్లా వున్న ఆ ముఖాల్ని చూస్తూ నన్ను నేను మరిచిపోతుంటాను....ఎంత సంతోషంగా ఆడుకుంటున్నారో ..."

ఆవిడ భావుకతకి నాకు ఆశ్చర్యం వేసింది.

"ఇద్దరు పిల్లలతోటే ఒకోరోజు తల నొప్పి వచ్చేస్తుంది నాకు. ఇంత మంది అల్లరినెలా భరిస్తారండీ మీరు?"

"అల్లరి....అవును... అల్లరి పిల్లలు కాక మనం చేయమన్నా చేస్తామటమ్మా. అమాయకమయిన వాళ్ళ ముఖాలు చూస్తే నాకెప్పుడూ విసుక్కోవాలనిపించదు.. అమ్మా నాన్నా లేని వాళ్ళ దురదృష్టాన్ని చూసి ఎంతో బాధగా వుంటుంది నాకు... " సీరియస్‌గా అంటున్నదల్లా మాట మార్చేసి "అయినా మా పిల్లలంతా చాలా బుద్ధి మంతులుగా, నేచెప్పినట్లు వింటారు" అంది తేలిగ్గా నవ్వుతూ.

తర్వాతేం మాటలు సాగలేదు. ఆడు తున్న పిల్లల వయిపు చూస్తూ కూచు న్నాను. ఇంతలో మా బాబు ఆడుతూ కిందపడ్డాడు. పన్నెండేళ్ళ కుర్రాడొకడు, ఏడుస్తున్న బాబుని మా దగ్గరికి తీసు కొచ్చాడు.

ఆ కుర్రాడి ముఖం నన్నెంతో ఆకర్షిం చింది. పచ్చటి ఆ ముఖంలో అల్లరిగా నవ్వుతున్న పెదవులూ, బూరెల్లా వున్న బుగ్గలూ—ముఖంమీద పడుతున్న జుట్టుని తోసుకుంటూ మా దగ్గరికొచ్చి నిలబడ్డాడు.

ఆత్రుతగా బాబుని దగ్గరికి తీసు కున్నాను. దెబ్బేమయినా తగిలిందేమోనని చూశాను. ఆ కుర్రాడు ఏమీలేదన్నట్లు చేతిని తిప్పి చూపాడు.

"అరె! అంత మాత్రానికే అంత ఏడ వచ్చా, ఆటల్లో పడిపోతే ఏడవకూడదని నాన్నారు చెప్పలే. పోమ్మా వెళ్ళి ఆడుకో పో," అని పంపేశాను బాబుని.

ఆ కుర్రాడు మాత్రం అక్కడే నిలు చుని నా వళ్ళోవున్న పాపని చూస్తున్నాడు చిత్రంగా. మాట్లాడించకుండా ఉండలేక పోయాను.

"నీ పేరేమిటి బాబూ?" అన్నాను.

మాట్లాడకుండా కళ్ళు చిట్లిస్తూ, అస్తమిస్తున్న సూర్యుడివైపు చూపాడు. నేను అయోమయంలోంచి తేరుకునేసరికి మేట్రన్‌గారు చెప్పింది. "వాడికి మాటలు రావమ్మా!" అని.

"ఓహ్! ఇంత చక్కని అబ్బాయి మూగవాడా?" అనుకున్నాను.

"నీ పేరు రవా బాబూ?" అన్నాను. కాదన్నట్లు తల అడ్డంగా తిప్పాడు.

"సూర్యమా? అన్నాను. అవునన్నట్లు నవ్వుతూ తలవూపేడు.

దీక్షగా పాపని చూస్తున్నవాణ్ణి. "పాప నెత్తుకుంటావా?" అని అడిగాను.

"ఉహూ" అన్నట్లు తల అడ్డంగా తిప్పి, చేత్తో పాప చెంపతాకి ముద్దుపెట్టు కుని పరిగెత్తి వెళ్ళిపోయాడు.

వెళ్ళిపోతున్న—ఆ కుర్రాడినించి, నా దృష్టి మేట్రన్‌గారివయిపు తిప్పాను. నవ్వుతూవున్న ఆవిడ ముఖంలో దిగులు కనిపించింది. నేనేమీ మాట్లాడకుండా

ఆవిడే అంది. "వాడికి మాటలు రావు. చెవులూ వినిపించవ్. వాడి భవిష్యత్తు ఆలోచిస్తే భయమేస్తుంది నాకు."

ఆశ్చర్యమేసింది. "మరి ..." నేను పూర్తిచేయక మునుపే ఆవిడే అంది. "మనం మాట్లాడితే పెదవుల కదలికను బట్టి.ముఖంలో భావాన్ని బట్టి అర్థం చేసుకుంటాడు ...నాలుగేళ్ళ వయసులో మా శరణాలయంలో చేర్చారు ఎవరో. అప్పట్నించీ ఆ మాత్రం అర్థంచేసుకోవడం నేనే నేర్పాను. మిగతా పిల్లలంతా రోజూ స్కూల్ కెళతారు. అందరికీ ఏదో ఒక స్కాలర్‌షిప్ వుంది. వీడొక్కడే శరణాలయం సర్వెంట్‌లా అయిపోయాడు. ఆ పనీ ఈ పనీ చేసి రోజంతా పొద్దుపుచ్చుతాడు. సాయంత్రం మిగతా పిల్లలు రాగానే, అంతా వీడికి కబుర్లు చెప్పాలి. చాలా తెలివయిన వాడు."

మాట్లాడుతుండగానే చీకటి పడుతూ వుంది. వెళ్ళొస్తానని చెప్పి, పిల్లల్ని తీసుకుని ఇంటికి దారిపట్టేను.

* * *

అంతదూరంలో వుండగానే ఇంటి ముందు స్కూటర్ కన్పించింది.నాన్నొచ్చారని గోలచేస్తూ, గెంతుతూ నాకంటే ముందుగానే వెళ్ళిపోయాడు బాబు. వరండాలో పిట్టగోడమీద కూచుని సిగరెట్ కాలుస్తూ, కుమారరత్నంతో కబుర్లు చెబుతున్నారు శ్రీవారు నే చేరుకునేసరికి.

"సారీ సార్! మీరు ఆలస్యంగా వస్తారన్నారని పిల్లల్ని అలా పార్క్‌కి తీసికెళ్ళా. కాస్త ఆలస్యం అయిపోయింది" అడక్కుండానే సంజాయిషీ ఇస్తూ తలుపు తాళం తీసాను.

పాపను ఎత్తుకుని ఇంట్లోకి అడుగుపెట్టారు ఆయన.

వంటింట్లో దూరి కాఫీకి ఎసరు పెట్టాను. ఎంత ఆలస్యంగా వచ్చినా ఫ్రెష్‌గా చేసేదాకా ఓపిగ్గా కూచుంటారు కానీ ఫ్లాస్క్‌లో పోస్తే నచ్చదాయనకి.

పదే పదే ఆ మూగ పిల్లడి ముఖమే గుర్తొస్తోంది. ఎంత అమాయకత్వం? దేవుడు కొంత మందికెందుకిలా అన్యాయం చేస్తోడో! పైగా దిక్కు లేనివాడు....

శ్రీవారి పిలుపుతో ఆలోచల్నించీ తేరుకున్నాను.


ఏమిటీ అంత ఆలోచన? నీళ్ళు ఇగిరిపోతాయి నువ్వు కాఫీపొడి చేసేలోగా." అని నవ్వుతూ నిలబడున్నారు పాపనెత్తుకుని.

గబా గబా కాఫీ కలిపి ఆయన కిచ్చాను. అదే చేత్తో మరి కాసిన్ని నీళ్ల కాచి పాపకి పాలు కలిపేను.

పాలు ఫీడర్‌లో పోసి, పాపని వళ్ళోకి తీసుకున్నాను. బాగా ఆకలిగా వుందేమో గబ గబా పాలన్నీ తాగేసి నిద్రలో పడిపోయింది పాప.

మళ్ళీ ఆలోచనలు చుట్టు ముట్టేయి నన్ను. మేం ఈ వూరొచ్చి నెల రోజులవొస్తోంది. వచ్చినప్పట్నించీ పని కుర్రాడ్ని చూసుకోవాలని అనుకుంటున్నాం, దొరకటం లేదు. పోనీ. ఈ సూర్యాన్ని మా ఇంట్లో వుంచేసుకుంటే—అనిపించింది. మళ్ళీ అనుమానం, ఆయనొప్పుకుంటారా అని. ఒప్పుకున్నా నేనే వాడితో డీల్ చేయగలనా అనీ భయం.

ఎప్పుడొచ్చారో ఆయన, పక్కనే చాప మీద కూచొని, భుజం మీద చేయి




వేసి, "ఏమిటోయ్ అదోలా వున్నావివాళ? పాప నిద్రపోయి ఎంత సేపయిందో! దాన్ని పడుకోబెట్టి నీళ్ల తోడతావేమోనని చూస్తున్నా" అన్నారు.

"ఓ సారీ! పదండి స్నానం చేద్దురు గానీ" అని పయికి లేచాను.

నా ఆలోచనల్లో నేనుండగానే భోజనాలు అయిపోయినయ్. బాబుకీ, ఆయనకీ పక్కలు సరిజేసి, పాప పక్కన సర్దుకుని పడుకున్నాను. ఆయనేదో చదువుకుంటున్నారు.

ఎంతకీ నిద్ర పట్టేలా లేదు. ఆయన్తో విషయం చెప్పేయందే నాకు తోచదు. మెల్లిగా లేచి వెళ్ళి ఆయన కెదురుగా టేబుల్ మీద కూచున్నాను. అలా వచ్చానంటే ఏదో చెప్పటానికేనని తనకి తెలుసు.

"చెప్పు" అన్నట్లు నవ్వుతూ చూశారు.

"మరేనండి, ఇవాళ పార్క్‌లో శరణాలయం పిల్లలొస్తే, వాళ్ళ మేట్రన్ గారితో పరిచయం అయింది. వాళ్ళలో ఒక మూగ కుర్రాడున్నాడు. పన్నెండేళ్ళ వయసు వుండొచ్చు. పేరు సూర్యం. చక్కగా, ఆరోగ్యంగా ఉన్నాడు. అన్ని పనులూ చేస్తాడుట. మన మెలాగా సర్వెంట్ కోసం వెతుకుతున్నాంగా? వాడ్ని పెట్టుకుంటే బాగుంటుందేమోనని ఆలోచిస్తున్నా."

నేను మొదలు పెట్టానంటే, చివరంటా చెప్పందే వదల్నని ఆయనకి తెలుసు. అందుకనే పెదవి కదపకుండా అంతా విని, అంతేనా అన్నట్లు చూశారు. "అబ్బ ఇంట్లో కూడా ఆఫీసర్ పోజేనా?" అనుకుని నవ్వుకున్నాను.

తను మాత్రం ఒక్క నిమిషం ఆలోచించి అన్నారు. "నువ్వు ఈ విషయాన్ని

గురించి సాయంత్రం నించీ ఆలోచిస్తు న్నావంటే, వాణ్ని చూసి బాగా మూవ్ అయినట్లు కనిపిస్తూంది. దాంతో ఏదో ఒకటి చేసి వాడికి సహాయం చేయాలని ఆరాటం. సరే చూద్దాం....నే రేపెళ్ళి మాట్లాడతా ఆ మేట్రన్‌గారితో. ఒక నెల రోజులు ట్రయల్ వేసి చూసుకో. సరిపోకపోతే పంపించేద్దాం.. సరే పద పద. ఆలస్యం అయిపోయింది. పడు కుందాం" అని, విషయాన్ని ఒక ముక్కలో తేల్చేసి, పక్క దగ్గరికి లాక్కె ళ్ళారు.

ఇంతకీ ఇలా అటో ఇటో తేల్చి నిర్ణ యించే భర్తే లేకపోతే, ఆడదాని జీవిత మంతా డైలమాలకే సరిపోతుందేమో నన్పించింది.

* * *

సాయంత్రం అయింది. శ్రీవారి కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నా. ఇంతలో పాప, బాబు తగవు మొదలు పెట్టారు. పాప భలే మొండిది. ఇంత చిన్నదానికే అంతెత్తు ఏడుపు లంకించు కుంటుంది.

బాబుకో రెండు అంటించి, పాపని సముదాయించేసరికి స్కూటర్ చప్పుడు విన్పించింది.


గబ గబా వెళ్ళి తలుపు తీసాను. స్కూటర్ మీంచి దిగుతున్నా రాయన. ముందే ఓగి ఇంటి వయిపూ, బయటి కొచ్చిన నా వైపూ చూస్తూ నిలుచున్నాడు సూర్యం. ఆయన స్కూటర్‌ని పైకి తెస్తూండగానే, ఆత్రుతగా అడిగేను— "ఏకంగా తీసుకొచ్చేసేరే? మేట్రన్‌గారేమి టన్నారు?" ఇంకా ఎన్ని ప్రశ్నలు వేసుందునోగానీ. "అవన్నీ నీకెందుకు లెద్దూ! నువ్వు చెప్పింది చేశానుగా. నిన్ను గుర్తుచేసి, నీ ఇంటికి అని చెప్ప గానే ఎగిరిగంతేసి పరిగెత్తుకొచ్చేడువాడు. ఇంకేం అని తీసుకొచ్చేశాను" అని ఆయన నవ్వుతూ అనేసరికి, మారు మాట్లాడకుండా కాఫీ తెద్దామని వెళ్ళేను.

నా వెనకే ఇంట్లో అడుగు పెట్టిన సూర్యం వయిపు స్నేహపూర్వకంగా చూసేడు బాబు. నిన్న పార్కులో చూపిన గుర్తు ఇంకా ఉందల్లే వుంది వాడికి. సూర్యం మట్టుకు గబగబా వచ్చి, కింద కూచుని వున్న పాపని ఎత్తి చంకనేసు కున్నాడు. వాడి ఇష్టం చూస్తే, వాడు పాప కోసమే మా ఇంటికి వచ్చేడా అని పించింది నాకు.

పిల్లలదీ, వాళ్ళ నాన్నగారిదీ భోజనం అయేక, సూర్యం నేనూ, భోంచేశాం. ఒక చాప, దుప్పటి ఇచ్చాను పడుకొమ్మని చెప్పి వాడికి.

రాత్రి మెల్లిగా అసలు విషయం బయట పెట్టారాయన.

"మీ రడగంగానే వప్పేసుకున్నారా? మేట్రన్ గారింకేం అనలేదాండీ?" అనడి గాను. "ఆఁ! అంత త్వరగా వప్పుకుం టుందా? చాలా గట్టి ఆవిడల్లే వుంది. అయినా ఆ మాత్రం గట్టితనం వుండాల్లే. 'వాడి కిక్కడ చదు వెలాగూ లేదు. మీ దగ్గరే కాస్త మంచి భవిష్యత్తు వుండ వచ్చునేమోగానీ-మీరు బాగా ఆలోచించి నిర్ణయించుకున్నారా లేదా అని నా అను మానం. వాడా మూగవాడు. చెబితే వినటంవే కాని నోరు విప్పలేడు. చిన్న వాడు కదా మామూలుగా మెత్తగానే




వున్నా. ఎప్పుడో అప్పుడు కాస్త మొండి తనమూ వుంటుంది. పోనీ ఒక నెల రోజులు ట్రయల్‌గా తీసుకెళ్ళండి. నెల రోజుల తర్వాత కూడా వుంచుకోవాలని పిస్తే చెప్పండి, వాడి పేరు శరణాలయం లోంచి తీసేస్తాము. లేదా మీరు డీల్ చేయలేమనిపిస్తే, తిరిగి నాకు అప్పగిం చేయండి. నేనేమీ అనుకోను' అని చెప్పిగానీ పిల్లడ్ని పంపింది కాదు. మొదటి పరిచయంలోనే నిన్ను చూపి ఇంప్రెస్ అయిందిలా వుంది. అందుకే పంపింది. లేకపోతే అసలు పంపేసే కాదేమో!" అని ముగించారు.

'ఆవిడ ఆదుర్దాకి అర్థం లేదనిపిం చింది నాకు. పిల్లడు మంచివాడు. మాట్లాడ లేక పోతేనేం, చెప్పింది తెలుసుకు పని చేస్తాడు చాలదూ?' అన్పించింది నాకు.

కానీ ఆ అభిప్రాయాన్ని మేట్రన్‌గారి చ్చిన గడువు తీరేలోగా మార్చుకోక తప్ప లేదు. నా వయిపు నించే ఆలోచించి తీసుకున్న నిర్ణయానికి బలం ఎక్కడిది? ఆ కుర్రాడి వయిపు నేనేం ఆలోచించాను?

సూర్యం మెత్తనివాడే? చెప్పింది చెప్పినట్లు చక్కగానే చేసేవాడు. మాట రానివాడే అయినా, నా మూడ్స్ అర్థం చేసుకుని ప్రవర్తించేవాడు. అంత చిన్న వాడికి అంతమాత్రం సెన్స్ వుండటం గొప్పే. వాడున్న నెల రోజుల్లో జరిగిన మూడు ముఖ్యమయిన సంఘటనలవల్ల వాడు మా ఇంట్లో ఇమడలేడని అర్థమై పోయింది.

* * *

ఆ. వేళ మధ్యాహ్నం బాబునీ, సూర్యాన్నీ ఇంట్లో వుంచి, కాస్త పనుండి ఎదురింటికి వెళ్లాను. తిరిగొచ్చి నేను ఇంట్లో అడుగు పెట్టేసరికి, ఏం జరిగిందో గానీ, సూర్యం గట్టిగా బాబు వీపు మీదో దెబ్బ వేయటం, వెంటనే ఆ ధాటికి వాడు

కింద పడటమూ నా కళ్ళ బడింది. వెనకా ముందూ ఆలోచించలేకపోయాను. చెప్ప లేనంత కోపం వచ్చేసింది.

పట్టుమని సూర్యం చంపమీదో దెబ్బ వేసి, "వెధవా! చిన్నవాణ్ణి అంత దెబ్బ కొడతావా?" అని కళ్ళెరజేశాను. వాడు వద్దన్నట్లు చేతిని అడ్డుపెట్టుకుంటూ, వేలిని బాబువైపు చూపిస్తూ, చేత్తో తన చంప మీద కొట్టుకుంటూ ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నా నేను గమనించకుండా, వెంట వెంటనే వీపుమీదో నాలుగు అంటించాను. ఇటు దిరిగి ఏడుస్తున్న బాబుని తీసుకుని లోపలికెళ్ళాను.

నిదానంగా బుజ్జగించి అడిగితే అసలు విషయం బయటపెట్టాడు బాబు. తనేదో బొమ్మల పుస్తకం చూస్తుంటే, సూర్యం చూస్తానిమ్మని అడిగేడట. (ఈ పాటికే మా బాబుకి సూర్యంబాష అర్థమవుతూంది.) వీడివ్వలేదు. వాడు లాక్కున్నాడు. కోపంవచ్చి వీశో దెబ్బవేశాడు. దాంతో వాడోటి వేశాడు. ఇదీ జరిగిన సంగతి, ఇద్దరూ పిల్లలే కొట్టుకోవటం సహజమేనని నాకూ తెలుసు. కానీ ఇద్దర్నీ సమంగా చూట్టానికి నా మనసు వప్పలేదు. సూర్యం స్థానం ఈ ఇంట్లో సర్వెంట్‌గా మాత్రమే. చిన్నవాడు బాబు కొట్టినంత మాత్రాన వాడూ చేయి చేసుకోవడమేనా అన్పించింది.

సూర్యం ఏడుస్తున్న శబ్దం వినిపిస్తే బయటికి తొంగిచూసాను. వాడి ఒళ్ళో పాప కూచుని, తన భాషలో తానేదో చెబుతూ, వాడికళ్ళు తుడుస్తూంది.

ఆ వేళ భోంచేయలేదు సూర్యం, నేనూ పిలవలేదు. సామానుగదిలో ఒక మూల తన చాపమీద కూర్చుండిపోయాడు. ఆయన వెళ్ళి పిలుస్తానంటే నేనే వద్దన్నాను. "వాడికే అంత కోపం అయితే మనకెంత వుండాలి? ఒకపూట తినకపోతేనే, పుట్టి మునిగిపోయేదేం లేదు. వుండనీయండి. రేపు పొద్దున్న వాడేలేచి వస్తాడు" అన్నాను.

"ఏమో బాబూ నీ ఇష్టం వాడిష్టం. ఏమైనా చేసుకోండి" అని వూరుకున్నారాయన.

నేనన్నట్లుగానే, ఉదయం వాడే లేచి వచ్చి తన పనులు తాను చేసుకుపోయాడు రాత్రి అన్నం లేక ఆకలిగా వున్నాడేమో. కాఫీయిచ్చి, రాత్రిది వాడిభాగం అన్నం పెడితే అవురావురుమని తిన్నాడు.

మరో రోజు .... ఆవేళ దీపావళి పండుగ, ముందురోజే బజారు వెళ్ళి పిల్లలిద్దరికీ కొత్తబట్టలు తెచ్చాను. ఆయనేమో టపాకాయలు పట్టుకొచ్చేరు.

సాయం కొత్తలేశాను పాపకీ, బాబుకీ, వరండాలో నాన్నగారి దగ్గర కూచుని టపాకాయలు కాలుస్తున్నారిద్దరూ. దీపాలు అన్నీ చక్కగా అలంకరించటం, పిల్లల ముచ్చటని గమనించడం, మధ్య మధ్య గాలికి ఆరుతున్న దీపాల్ని వెలిగించటం—ఈ గొడవలో పడి, సూర్యం ఏం చేస్తున్నాడో గమనించలేదు నేను.

ఉన్నట్టుండి ఆయనే అడిగేరు—"సూర్యం ఏడీ కన్పించడేం?" అని.

అప్పుడు గుర్తొచ్చి, వాడికీ కొన్ని టపాకాయలిద్దామని ఇంట్లోకి వెళ్ళాను. ఇల్లంతా వెతికితే, స్టోర్‌రూంలో ముఖం దిగేసుకు కూచుని కన్పించాడు. "ఏమిట్రా

ఇక్కడున్నావ్? టపాకాయలు కొలుద్దురా?" అని పిలిచాను. తల ఎత్తి నా ముఖాన్నో సారి చూసి మళ్ళీ దించుకున్నాడు. "వీడో కడు! మనసులో ఏమంటుందో చెప్ప లేడు. పోనీ! వీడ్నెవడు బ్రతిమాలుతూ కూచుంటాడు" అని విసుక్కుని వచ్చే శాను.

ఆ వేళకిక బయటికి రాడనీ, భోంచేయ డని తెలుసు. వెళ్ళి చెప్పానాయనికి. "వాడి మనసులో ఏముందో తెలీదు. ముఖం ముడుచుకుని మూల కూచునున్నాడు ఎందుకనో" అన్నాను!

ఒక్క నిమిషం నా వైపు సాలోచనగా చూసి అన్నారాయన. "నే చెప్పనా ఎందుకో. వీళ్ళిద్దరికీ బట్టలు తెచ్చావ్. వాడికో జత చీప్‌వయినా తేవలసింది. అందుకే బాధ పడుంటాడు."

"సరిపోయింది! అన్నిట్లో వీళ్ళతో సమంగా కావాలంటే ఎలా కుదుర్తుంది? ఒకసారి చూస్తే వాడికే తన స్థానం అర్థ మవుతుంది లెండి" అన్నాడు.

* * *

సూర్యానికి పుస్తకాలంటే తగని పిచ్చి. పనేదీ లేనప్పుడు, ఏదైనా పుస్తకం పుచ్చుకుని, చదువుతున్నవాడిలా అక్షరాల వయిపే చూస్తూ కూచునేవాడు.

ఒకరోజు పొద్దుటే—శ్రీవారు ఆఫీస్‌కి బాబు స్కూల్‌కి వెళ్ళిపోయాడు. పాప ఊయెలలో నిద్రపోతూంది. అదే గది లోనే ఓ మూలగా కూచుని ఏదో పుస్త కంలో బొమ్మలు చూసుకుంటున్న సూర్యాన్ని భుజంతట్టి చెప్పాను. పాపని చూడమని, స్నానానికి బయల్దేరుతూ.

స్నానం చేస్తుండగానే పాప ఏడుపు విన్పించింది. సూర్యం ఉన్నాడుగా చూసు కుంటాడని తాపీగా ముగించాను. బట్టలు విడిచినవి బకెట్‌లో నానబెట్టబోతుండగా, దభీమని శబ్దం. వెంటనే పాప మరింత గట్టిగా ఏడవటం విన్పించింది. చేతిలో పని వదిలేసి, ఒకపరుగున ఇంట్లోకి వచ్చాను. పాప ఊయెల ప్రక్కన కింద పడిపోయి ఏడుస్తూంది. సూర్యమేమో ఇటు వయిపయినా చూడకుండా తన పుస్తకంలో నిమగ్నమయి వున్నాడు. ఈ పరిస్థితి చూసేసరికి నాకు కోపంతో వళ్ళు తెలి సింది కాదు. పాపనెత్తి చంకనేసుకుని, సూర్యందగ్గర కెళ్ళి, చేతిలోవున్న పుస్త కాన్ని లాగి, చెంపమీదో పెట్టుపెట్టాను— "వెధవా! ఏమిట్రా అంత మునిగిపోయే చదువు? పిల్లని చూస్తుండమని చెబితే, అది కింద పడిపోయి ఏడుస్తున్నా అటు వయిపయినా చూడకుండా చదువు వెలి గిస్తున్నాడు. అక్షరం ముక్క రాదుగానీ, అంతా జోరే ఈ దిక్కుమాలిన వాడికి" అని నేనేం మాట్లాడుతున్నానో కూడా ఆలోచించకుండా అనేశాను.

వాడు బిత్తరపోయి నా వయిపు చూసాడు. చంకలో ఏడుస్తున్న పాపని చూసి బిక్కమొహం వేశాడు. వాడి ముఖం చూస్తే నేవేసిన దెబ్బలే కానీ, నేనన్న మాటలు ఒక్కటీ అర్థం అవ లేదని తెలుస్తూంది. అప్పటిగ్గానీ గుర్తు రాలేదు నాకు-వాడు మూగవాడే కాకుండా చెవిటివాడు కూడా అని. మాట్లాడేటప్పుడు (అదైనా) నిదానంగా మన పెదాలవయిపు చూస్తేతప్ప ఏం చెబుతున్నదీ తెలుసుకో లేదు. అలాంటప్పుడు ఈ వయిపయినా

తలతిప్పని వాడికి పాపకింద పడటం ఏం తెలుస్తుంది? ఇంత ఆలోచనా వచ్చేక అనిపించింది. వాడ్ని అనవసరంగా కొట్టేనని.

నేను తేరుకుని చూసేసరికి, పాప ఏడుపు మానేసి మళ్ళీ నిద్రపోతోంది. సూర్యం ఎదురుగా కనిపించలేదు. ఎక్కడున్నాడని ఇల్లంతా వెతికాను. కన్పించ లేదు. గుండె గుభేలుమంది. ఇంతకు ముందు తనకు కోపం వస్తే గదిలో ముడుచుకు కూచోవటం. ఒక పూట భోజనం మానెయ్యడమే కానీ ఇలా ఇంట్లోంచి పారిపోలేదు. గాభరాగా వరం రాలో కాంపౌండ్‌లో అంతా వెతికాను.

శరణాలయానిగ్గానీ వెళ్ళిపోయాడేమో వెళ్ళి కనుక్కుందామా అన్పించింది. కానీ ధైర్యం చాల్లేదు. తీరా వెళ్ళేక వాడక్కడ లేకపోతే, మేట్రన్ గారికేం చెప్పను? అయినా అక్కడికి వెళ్ళుంటాడని నాకంత అన్పించటం లేదు కూడా. మా ఇంటి నుంచి అక్కడికి చాలా దూరం. ఒకటి రెండుసార్లు పార్కుకి రాగా చూచిన దారే కానీ, వాడి కంత బాగా గుర్తుండదు. ఎవరి నయినా అడిగి తెలుసుకుందుకు మాటరాని వాడు. అక్కడికే వెళ్లుండ దేమో అన్పించేసరికి మరింత భయం వేసింది నాకు. ఏమయిపోయుంటాడోనని. రోజంతా భోజనం లేకుండా ఆలోచనల్తో సతమతమవుతూ గడిపాను.

సాయంత్రం ఆయన రాగానే, భయ పడుతూ నేచెప్పాను జరిగింది. నిర్లిప్తంగా విని "అయితే అదీ అయిందన్న మాట. పోనీ కాస్త కాఫీ ఇవ్వు. వెతికొస్తాను నాలుగు వీధులూ తిరిగి" అన్నారు.

రాత్రిదాకా వెతికారు ఆయన. కానీ ప్రయోజనం లేకపోయింది. భోజనం చేశాక—"నే నో మాట చెబుతాను చూడు. నువ్వనవసరంగా బెంగ పడుతు న్నావ్. వాడెక్కడున్నా పొద్దుటికి వచ్చే స్తాడు. నా మాట నమ్ము. ఎంత కోపం వున్నా, నీ కోసం, చివరికి పాప కోస మయినా రాకుండా వుండలేడు. నువ్వంటే వాడి కెంత అభిమానమో నీకు తెలీదు" అన్నారు నింపాదిగా.

నన్ను ఊరడించడానికే అట్లా అంటు న్నారనుకున్నానుగానీ, ఆయన అన్నట్లు నిజంగానే, వుదయం ముందు తలుపు తెరిచేసరికి వరండాలో తల వంచుకుని కూచుని ఉన్నాడు సూర్యం. ప్రాణం లేచొచ్చింది నాకు. చంకలో వున్న పాప గబుక్కున కిందికి దిగి, సూర్యం దగ్గరి కెళ్ళి, వళ్ళో కూర్చుండిపోయింది.

పై సంఘటన జరిగిన రెండు రోజులకి కాబోలు మేట్రన్ గారిచ్చిన గడువు అయి పోయింది. చివరి రోజుని అడిగారాయన "ఊఁ! రేపెళ్ళి మేట్రన్‌గారికి చెప్పాలి. మరేమని నిర్ణయించుకున్నావ్?" అని నవ్వుతూ.

నాకు ఏం చెప్పాలో తోచలేదు. శరణాలయంలో సూర్యానికి ఉన్న ఆశ్ర యాన్ని శాశ్వతంగా పోగొట్టి, ఇంట్లోనే ఎప్పటికీ భరించగలనా అని అనుమానం. అట్లాగని వాడ్ని వదులుకోవటం అసలే ఇష్టం కాదు. అయోమయంగా ఆలోచిస్తూ వుండిపోయాను.

మెల్లిగా తనేం అనుకుంటున్నారో బయట పెట్టారు శ్రీవారు. "చూడయ్యేవ్! నువ్వు బాధ పడనంటే నేనో మాట



చెబుతాను...." అని నా సమాధానం కోసం చూడకుండానే సాగించారు: "సూర్యం మన ఫేమిలీనుంచీ, ముఖ్యంగా నీనించే కోరుకుంటున్నది వేరు; మనం వాడి కీయగలుగుతున్నది వేరు. వాడు పెరిగింది అనాధ శరణాలయంలో. వాడి కర్థమయ్యే భాష చాలా పరిమితం. ఆ వయస్సుకి సర్వెంట్‌కీ, మామూలు పిల్లలకీ వున్న భేదం వాడికి తెలీదు. శరణాలయం నించీ, నీ దగ్గరికీ, మనింటికీ అనగానే వాడు పరుగెత్తి వచ్చింది, మనం చెప్పింది పూర్తిగా అర్థమయి కాదు. మన ఫేమిలీలో ఒక మెంబరుగా రావటమేనని వాడికి తోచి వుంటుంది. ఈ నెల్లాళ్ళ వాడి ప్రవర్తనలో నాకు అర్థమయిందేమిటంటే వాడు నీకు పెద్ద కొడుకుగా అయితే మాత్రమే ఈ ఇంట్లో ఎడ్జస్టు అవగలడు. కానీ వేరే విధంగా మాత్రం కాదు. అందుకనే మన బాబు ముందు తనని తక్కువ చేస్తే చాలా బాధ పడ్డాడు. తనని ప్రేమించే అమ్మా, నాన్న, తమ్ముడూ, చెల్లాయి ఇదీ వాడు కోరుకున్న జీవితం....నా మనసుకితోస్తున్న దిది. ఎట్లు నిర్ణయించుకున్నా నాకేం అభ్యంతరం లేదు. ఎందుకంటే సర్దుకు పోవలసిందానివి నువ్వు" అని చెప్పి తను చెప్పాల్సిందయిపోయినట్లు తలగడా సర్దుకుని, పడుకున్నారు.

*   *   *

మరుసటు రోజే సూర్యాన్ని శరణాలయంలో వదిలెయ్యమని వారితో పంపించేశాను. వాణ్ని మా ఇంటికి తీసుకురావటం ద్వారా, వాడికో అర్థం లేని ఆశ కల్పించానని, ఆఖరికి వాడి చిన్న మనసుని గాయం చేశాననీ నాకు తెలుసు. కానీ....కానీ....ఆ మూగ సూర్యాన్ని-దిక్కు మొక్కు లేనివాణ్ని నా కొడుకుగా స్వీకరించేంత, త్యాగాన్ని చేయగల శక్తి నాకు లేదు. అందుకనే వాడిపై కాస్త అభిమానమయితే వున్నా, వదులుకోక తప్పలేదు. □